# రెండు గుండెల మనిషి

'ఏరా! సత్తెం! నువు మొగోడివి కాదంట్రా?' అని చిట్టెమ్మ సత్యాన్ని అడిగి అయిదు నిమిషాలు పకపక నవ్వింది. సత్యం సిగ్గుపడిపోయాడు. సిగ్గుతో కుంచించుకుపోయాడు. నోరువిప్పి ఏమీ మాట్లాడలేకపోయాడు. రాత్రి పదిగంటలయింది. సత్యం చిట్టెమ్మను సైకిలు రిక్షాలో సత్యాలాడ్జికి తీసుకువెళు తున్నాడు. లాడ్జి చేరుకున్నాక, 'తెల్లోరుజాముని నాలుక్కల్లా వొచ్చెయ్' అని చెప్పి చీరకొంగుతో మొహం కప్పేసుకుని ఆమె లాడ్జిలోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

చిట్టెమ్మ తల్లిదండ్రులు ముసలివాళ్ళయిపోయారు. ఆమె తండ్రి ఎడ్లబండి నడుపుతూ ఇసుక, మట్టి, ఇటుకలు, రాళ్ళూ తోలుతూ ఉండేవాడు. వయసు మళ్లిపోయాక బండినీ, ఎడ్లనీ అమ్మేశాడు. తల్లి కూడా తట్టలు మోస్తూ తండ్రికి సాయం చేస్తూ ఉండేది. చిట్టెమ్మ అన్న పదోక్లాసు పాసై లారీలూ బస్సులూ బాగుచేసే గ్యారేజీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. కొడుకు అందొచ్చినందుకు తల్లిదండ్రులు సంతోషంగా ఇంటి దగ్గర కూర్చుని జీవితాన్ని సుఖంగా గడుపుతున్నారు. అయితే అలా ఎంతోకాలం జరగలేదు. అతడు గ్యారేజీ యజమాని కూతుర్ని లేవదీసుకొని ఎక్కడికో పారిపోయాడంటారు. సంవత్సరం దాటిపోయినా ఏ కబురూ లేదు. కుటుంబం బతకడానికి ఆధారం లేకుండా పోయింది. ఎనిమిదోక్లాసు పాసై చిట్టెమ్మ చదువు ఆపేసింది. తల్లిదండ్రులు నడవలేనిస్థితిలో ఉన్నారు. అప్పుడామె గాజులు - ఫ్యాన్సీ సామాన్లు - అమ్మే పెద్ద షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని ఆదుకుంటోంది. ఒకపూట తింటూ రెండోపూట పస్తులు వుంటూ బతుకుతున్నారు. ఆ షాపు యజమాని వూరికెళ్ళినప్పుడు అతడి కొడుకు షాపు చూస్తాడు. అతడు కాలేజీలో చదువుతున్నాడు. ఒక రోజు ఆమెను బలాత్కరించాడు. ఆమె పని మానేసింది. ఎక్కడ పని చేసినా అదే జరుగుతుందని ఆలోచించింది. 'రోజుకి పదిరూపాయల కూలీ కూడా దొరకని షాపులో పనిచేస్తూ శరీరాన్ని అర్పించుకుంటూ ఉండాలా? లేదా శరీరాన్ని అర్పించుకుంటూ రోజుకి రెండువందలు సంపాదించాలా? ఒకసారి చెడిపోయాక ఎన్నిసార్లు చెడిపోయినా ఏమిటి తేడా?' అని ఆలోచించి ఆ రెండో పనే చేయాలని నిశ్చయించుకుంది. అయితే అతి జాగ్రత్తగా ఎవరి కంటా పడకుండా,

వీలైనంత రహస్యంగా ఆ పనిచేస్తోంది. ఆమె సత్యం రిక్షాలో మాత్రమే లాడ్జికి వెళుతుంది.

★ ★ ★

సత్యానికి పాతికేళ్లు దాటాయి. ఇరవైఏళ్ల లోపునే తల్లిదండ్రులు పోయారు. ఒక రిక్షా, తాటాకుల గుడిసె మాత్రం అతడికి మిగిలిన ఆస్తి. తోబుట్టువు లెవరూ లేరు. ఆ రిక్షాతో సత్యం జీవితాన్ని లాగుతున్నాడు. అతడు నమ్మకం అనే పునాది మీద జీవితాన్ని గడుపుతున్నాడు. ఆ వీధుల్లో అందరికీ అతడు తెలుసు. అందరికీ అతడిపట్ల అభిమానం, నమ్మకం ఉంది. పిల్లల్ని బడికి తీసుకువెళ్ళడం, షాపుల నుంచి సామాన్లు తీసుకురావడం, గ్యాస్ సిలిండర్లు తేవడం, ఏ పనైనా సరే చెబితే చాలా నమ్మకంగా చేస్తాడు. డబ్బూ, వస్తువులూ అందరూ అతడికి నమ్మకం మీద ఇస్తూ ఉంటారు. ఏ రాత్రి వేళ అవసరం వచ్చి పిలిచినా, చికాకు పడకుండా రిక్షా తీసుకువస్తాడు. అతడు అందరి ఇళ్ళల్లోనూ ఇంట్లో మనిషిలా ఉంటాడు.

సత్యం నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. తల్లిదండ్రులు పోయాక ఆ గుడిసెలో పడుకోడం దిగులుగా ఉందని మా ఇంటి అరుగుమీద పడుకుంటూ ఉండేవాడు. కబుర్లు చెబుతూ ఉండేవాడు. రేడియో పెట్టమని పాటలు, వార్తలు వింటూ ఉండేవాడు. రాత్రి పూట తరచుగా మా ఇంట్లోనే భోజనం చేస్తూ ఉండేవాడు. ఒకపూట ఒకడికి భోజనం పెట్టడం సంతోషంగానే ఉండేది కానీ, బాధగా ఉండేదికాదు. ఏ రోజైనా భోజనానికి అతడు రాకపోతే ఏదో వెలితిగా ఉంటూ ఉండేది.

సత్యంకి పెళ్లికాలేదు. అతడు ఒంటరివాడు అవడం వల్ల అతడికి అక్కడ దగ్గర బంధువులెవరూ లేకపోవడం వల్లా పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. పాతికేళ్లు దాటిపోయాయి. ఒంటరి జీవితం బాగానే ఉందని అతడు కూడా పెళ్లి గురించి పట్టించుకోలేదు.

★ ★ ★

ఆ రోజు రాత్రి చిట్టెమ్మ అడిగిన ప్రశ్న - ఆమె పకపక నవ్విన నవ్వు - అతడి మనసులో కదులుతున్నాయి. వాటిని మనసులోంచి బయటకు నెట్టివేయడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు. అయితే అలా చేయలేక పోతున్నాడు.

ఒంటరిగా ఉంటున్నాడని చిట్టెమ్మ వారానికోసారి వచ్చి, సత్యం ఇంటిని శుభ్రంచేసి, పేడతో అలికి, ముగ్గు పెట్టి, మంచినీళ్ళ బిందె, గిన్నెలూ కడుగుతోంది. సత్యం ఒద్దని చెప్పినా 'నువు నాకు సాయం సేత్తన్నావు. నాను నీకు రుణపడి ఉండిపోకూడదు!' అని చెప్తోంది. నిజానికి ఆమె అలాంటి భావంతోనే చాలా రోజులనుంచీ ఆ సాయం సత్యానికి చేస్తోంది. ఆ రోజు కూడా ఆమె అతడి ఇల్లు శుభ్రం చేసి అలికి ముగ్గులు పెట్టింది. బిందె, గిన్నెలూ కడిగింది. బిందెతో నీళ్ళు తెచ్చి పెట్టింది. ఆమె ప్రశ్న - నవ్వూ అతడి మనసులో కదులుతున్నాయి.

'ఓరి సత్తిగా! నీకు మనసైతే నీ యింట్లో ఎప్పుడూ ఉండిపోతాను!' అని ఆమె పకపక విరగబడి నవ్వింది.

'నాడ్జీలంట తిరిగే గుంటతో కాపురవేటని అనుకోమాక! ముసిలోళ్ళ కోసరం - కూడు దప్పిక కోసరం - ఆ తప్పు సేత్తన్నాను! అది నీకు తెల్దేటి?!

సత్యం ఆశ్చర్యపడుతూ మౌనంగా ఉండిపోయాడు.

'నీ నెత్తిమీద సెయ్యేసి సెప్పు! నా నెత్తి మీద సెయ్యేసి సెప్పు! నువ్వింతవరకూ ఏ గుంటకాడా తొంగోనేదా?!'

సత్యం లేదని చెప్పలేకపోయాడు.

'నాను సేత్తే అది తప్పా? నువు సేత్తే తప్పుకాదా?'

'ముసిలోళ్ళు ఇయ్యాలా - రేపా - అన్నట్టున్నారు! ఆల్లు పోయాక నాను వొంటరిదాన్నయిపోతానని దిగులుగుంది! ఒవున్నోవొకిణ్ని కట్టుకోకపోతే, మొగోళ్ళు నన్ను బతకనిస్తరేటి?! నవిలి మింగేత్తారు! నువ్వు ముదిరిపోతన్నావు! ఒవుల్లూ పిల్ల నిత్తానని రానేదు! నీకు మాత్తరం ఆడదక్కర్నేదా! సెప్పనేక సెప్పనేక మనసులో వున్నమాట యియ్యాల తెగించి చెప్పేసాను! మరి నీ ఇష్టం! ఇష్టముంటేనే సెప్పు! ఇబ్బంది పడమాక!' అని చిట్టెమ్మ మనసులో వున్నమాట తెగించి చెప్పింది.

సత్యం చాలాసేపు ఆలోచించాడు. ఆలోచిస్తూ ఆలోచిస్తూ చాలాసేపు గడిపాడు. మరింక ఆలోచించడం మానేసాడు.

'అలాగే కానియ్యి! నువు చెప్పిన మాటల్లో పొల్లుమాట వొకిటీనేదు! అలాగే కానియ్యి!' అని సత్యం తన అంగీకారాన్ని సంతోషంతో వుత్సాహంగా చెప్పాడు.

'నాను మొగోణ్ని అవునో కాదో యిప్పుడు నువ్వు సెప్పు!' అని ఆమెను చేతుల్లోకి తీసుగున్నాడు.

సత్యం రిక్షా లాగుతూ సంపాదిస్తున్న డబ్బుతో ఇద్దరూ జీవితాన్ని సుఖంగా గడుపుతున్నారు. రోజులు తెలీకుండా దొర్లిపోతున్నాయి.

'ఓరి సత్తివా! నాను ఏ పనీనేకుండ గూకోడం ఏల? మనిల్లు రోడ్డు పక్కనే ఉంది కదా! కిల్లీ బడ్డీ ఎడదావని అనుకుంతన్నాను! ఏతంతవ్?!' సత్యం మౌనంగా ఉండిపోయాడు. ఆలోచనలో పడ్డాడు.

'ఆడుసూడు! కిల్లీబడ్డీ అప్పారోవుగోడు! ఆడు ఒవులికి పుట్టాడో ఒవులికీ తెల్దు! ఆడికి ఇంటిపేరునేదు! కిల్లీ బడ్డీ ఇంటిపేరైపోయింది! ఇయ్యాల ఆడు తెలీనోడు ఒవుడూ నేడు. కిల్లీ బడ్డి ఎట్టి నచ్చులు కూడబెట్టాడు. బడ్డీలో ఏటమ్మాడో ఒవుడికి తెల్దు! ఆడిసుట్టూ ఎంతమందిరి ఇయ్యాల అప్పులకోసరం తిరగతన్నారో! సిన్నోళ్ళు పొగులే ఎల్తారు. పెద్దోరు ముసుగేసుగుని రాత్తిరి సీకటడ్డాక ఎల్తారు! ఆడిప్పుడు పవర్‌ఫుల్ మడిసైపోయాడు. ఆడు ఏ పాపాలు సేసి ఒవుడి గొంతుకకోసి నచ్చులు సంపాదించాడో ఒవులూ సూడ్డంనేదు. ఆడికాడ డబ్బుంది! అదే అందరూ సూత్తన్నారు. ఆడిసుట్టూ అందరూ తిరగతన్నారు. బగమెంతుడు రచ్చిత్తే కిల్లీబడ్డీ బాగా నాగితే నువ్వూ పవర్‌ఫుల్ మడిసివైపోవ్!' అని చిట్టెమ్మ వివరంగా చెప్పింది. సత్యం కాదనలేదు. ఒప్పుగున్నాడు. కిల్లీబడ్డీ పెట్టించాడు. కిల్లీబడ్డీ అప్పారావు ప్రారంభోత్సవం చేశాడు. కిటుకులు చెప్పాడు. బడ్డీలో సోడాబుడ్లు అమ్ముతోంది. బడ్డీ వెనకసారాబుడ్లు అమ్ముతోంది. బడ్డీ ముందు పత్రికలు వేలగడుతోంది. బడ్డీలో నోరూరించే సెక్స్ పుస్తకాలు అమ్ముతోంది. నగ్నంగా వున్న యువతుల ఫోటోలు సిగరెట్ పెట్టెల్లో పెట్టి, రేటు నాలుగు రెట్లు చేసి అమ్ముతోంది. అలాంటి కిటుకులు అమలుజరుపుతోంది. సత్యం సంపాదించుకున్న నమ్మకం వల్ల కిల్లీబడ్డీ బాగా నడుస్తోంది. చిట్టెమ్మ చిలిపితనం వల్ల కిల్లీబడ్డీ బాగా బాగా నడుస్తోంది. అమ్మకూడనివి అమ్ముతూ ఉండడంవల్ల కిల్లీబడ్డీ జోరందుకుంది.

★ ★ ★

సత్యం రిక్షా లాగడం మానేశాడు. సంపాదించిన డబ్బుతో అయిదు రిక్షాలు కొన్నాడు. వాటిని అద్దెకు ఇస్తున్నాడు. అతడు కూడా కిల్లీబడ్డీలో కూర్చుంటున్నాడు.

'ఓరి సత్తిగా! కిల్లీబడ్డీ జోరుగా నాగుతోంది. మెయిలుబండిలా నాగుతోంది!

నువ్వు కిల్లీబడ్డీలో గూకో! కిల్లీబడ్డీనానుకొని నాను టీకొట్టు పెడతాను!' అని చిట్టెమ్మ చెప్పింది. సత్యం కాదనలేదు. సంతోషంగా ఒప్పుగున్నాడు.

సత్యం కిల్లీబడ్డీలో కూర్చుంటున్నాడు. ఆఫ్ పాంటు మానేసి ఫుల్‌పాంటు వేసుగుంటున్నాడు. అడ్డగళ్ళ అమెరికన్ బనియన్ వేసుగుంటున్నాడు. నల్లటద్దాల కళ్లజోడు పెట్టుగుంటున్నాడు. స్టార్‌షూ వేసుగుంటున్నాడు.

చిట్టెమ్మ టీకొట్లో కూర్చుంటోంది. టీకొట్టు జోరందుకుంటోంది. పకోడీలలోనూ- టీలోనూ- గంజాయి ఆకు లాంటి మత్తు కలిగించే ఆకులు కలపడం వల్ల టీకొట్టు జోరందుకుందని గిట్టనివాళ్ళు కొందరు చెప్పుగుంటున్నారట!

★ ★ ★

చిట్టెమ్మ సత్యం క్షణం తీరిక లేకుండా ఆనందంగా సంతోషంగా రెండు చేతుల్తో డబ్బు సంపాదిస్తూ జీవితాన్ని గడుపుతున్నారు. కొంతకాలం గడిచాక చిట్టెమ్మచెప్పింది.

'ఒరేయ్ సత్తివా! సెభాష్, సెభాస్! పాపాలు సేత్తేనే మడిసి డబ్బు సంపాదించి పవర్‌ఫుల్ మడిసైపోతాడని తెలుసుగున్నావ్! ఇంక నిన్నొవుడూ ఆపనేడు. సెభాస్ సెభాస్! ఒక 'ఐడియ్యా' యిత్తన్నాను. ఒడ్డీ వ్యాపారం మొదలెడదాం! తాకట్టుమీద అప్పులిద్దాం! అలాగే, కూరలూ, సేపలూ, మాంసం అమ్ముకునే వోళ్ళకి కూడా అప్పులిచ్చి ఏరోజుకారోజు ఒసూలు సేద్దాం! సిన్నోళ్లు పొగులూ - పెద్దోరు ముసుగేసుకుని మాపిలీ – నీ సుట్టూ తిరగతావుంతారు! నువు 'పవర్‌ఫుల్' మడిసివి అయిపోతావ్!' అని చిట్టెమ్మ చెప్పగా సత్యం వుత్సాహంగా ఒప్పుగుని ఆ మర్నాడే రిక్షా వాళ్ళూ - కూలీలూ - అందరికీ చెప్పి వడ్డీ వ్యాపారం ప్రారంభించాడు. సత్యం బాగా డబ్బు పోగు చేశాడు. బ్యాంకులో కొంత అప్పు తీసుకున్నాడు. పాత ఇల్లు పడగొట్టించి నాలుగు గదుల పక్కా ఇంటిని కట్టించాడు. మరో రెండు గదులకు పునాది వేసి ఉంచాడు.

ఒకరోజు రాత్రి చిట్టెమ్మ సత్యంతో చెప్పింది.

'మనం ఆ రెండు గదులూ కూడ బేగి లేపాలి. అంటే బేగి డబ్బు పోగుసెయ్యాలి. నువు తప్పు అనుకోనంటే సిన్న మాట అంతాను. పెల్లయిన కొందరు గుంటలు నాడ్జీలకి ఒప్పుగోరు గానీ ఇళ్ళల్లో అయితే - అరగంటా - గంటా పొగులు సర్దుకుంతా ఉంతారు. కొందరు మొగోల్లున్నారు. ఆల్లు సాల

పెద్దోరు. ఉద్యోగాలు – బూవులు – భవనాలు – ఉన్నోళ్ళు! పెద్ద ఏపారస్తులున్నారు! ఆల్లు నాడ్జీలంట తిరిగితే పరువుపోద్దని ఎల్లరు! ఇళ్ళకయితే ఒత్తారు! ఆళ్ళు పెల్లాల్ని ఇళ్ళల్లో షో కేసుల్లో బొమ్మలా ఎట్టుగుని సందుల్లో సిరుతిళ్ళ కోసం తిరగతా ఉంతారు! ఆ గుంటల్నీ – ఆ బాబుల్నీ – ఎనక గదిలో కలుపుతూ ఉంతాను! సిల్లర దుకాణం నడుపుతాను. పెట్టుబడి అక్కర్లేని ఏపారం. ఆలోసించి సెప్పు!' అని చిట్టెమ్మ చెప్పగానే, 'నీది గొప్ప బుర్ర!' అని ఆమెను పొగిడేడు. వెంటనే ఏర్పాట్లు జరిగిపోయాయి.

★ ★ ★

సత్యం జీవితం పూర్తిగా మారిపోయింది. క్షణం తీరిక లేకుండా అయిపోయాడు. 'పవర్‌ఫుల్' మనిషి అయిపోయాడు. చిట్టెమ్మ తాకట్టు పట్టిన బంగారు నగలు వేసుకుంటోంది. తాకట్టు పట్టిన వెండి వస్తువులు ఇంట్లో వాడుకుంటోంది. తాకట్టు పట్టిన ఇత్తడి సామాన్లూ, గిన్నెలూ కిల్లీబడ్డీలో – టీ కొట్లో – వాడుకుంటోంది. సత్యం రిక్షాలు ఇజేనగరం – నెల్లిమర్ల బస్సుల్లా ఖాళీ లేకుండా తిరుగుతున్నాయి.

టీకొట్టు – కోరమండల్ రైలుబండిలా – దూసుకుపోతోంది. కిల్లీబడ్డీ – మద్రాసు మెయిల్లా – జోరుగా పరుగెడుతోంది. వడ్డీ వ్యాపారం – ఇజేనగరం – ఇసాఖ నాన్‌స్టాప్ బస్సుల్లా పరుగెడుతోంది. చివరి గదిలోని చిల్లర దుకాణం – గుట్టుగా – సంసారంలా – ఇమానంలా ఎగురుతోంది. మిగిలిన రెండు గదులూ కొద్దికాలంలోనే పూర్తయిపోయాయి.

★ ★ ★

కాలప్రవాహంలో సంవత్సరాలు కొట్టుకుపోతూనే ఉన్నాయి. సత్యం వీలయినప్పుడల్లా వచ్చి కలుస్తున్నాడు. వ్యాపారం ఎలా పెరుగుతుందో చెబుతూనే ఉన్నాడు. చాలా ఉత్సాహంగా – సంతోషంగా కబుర్లు చెబుతూనే ఉన్నాడు. ఆరు నెలల కిందట ఒకసారి వచ్చాడు. 'బాబూ! కష్టపడి బతికినంతకాలం నాకు కూడే లేదు! ఇప్పుడు ఎటు చూసినా – ఎక్కడ చూసినా – డబ్బే! డబ్బే! డబ్బే!' అని ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో చెప్పాడు. ఇద్దరు పిల్లల్నీ కాన్వెంటులో చదివిస్తున్నట్లు కూడా చెప్పాడు.

★ ★ ★

సత్యం ఈ మధ్దిన మళ్ళీ వచ్చి చాలాసేపు నాతో కబుర్లు చెప్పాడు. రెండు నెలల కిందట బాగా జబ్బు పడ్డాడట. నెలకిపైగా మంచం పట్టాడట. ఆ తర్వాత ఇప్పుడు బాగా కోలుకున్నాడట. ఆరోగ్యం మామ్మూలుగానే బాగానే ఉందట.

'బాబూ! మనసులో ఏదో బాధ! గుండెలు పట్టుకుని పిండేస్తున్నట్లు బాధ! ఆ బాధ ఏటో తెలీలేదు!' అని చేయి గుండెల మీద వేసుకుని చెప్పాడు. బాధపడుతూ బాధగా చెప్పాడు.

'చూడు సత్యం! కిల్లీబడ్డీ అప్పారావు లాంటి వాళ్ళు కొత్తతరం ధనికవర్గాన్ని పెంచుతున్నారు. ఇప్పుడది బాగా పెరిగిపోయింది. పేదప్రజల కష్టాలూ - మనుషుల బలహీనతలూ - డబ్బుగా మార్చుకోడం నువు నేర్చుకొని చాలా నేర్పుతో చాలా డబ్బు సంపాదించావు! నీ కొత్త గుండె - రెండో గుండె - పేదల రక్తం మరిగిన పులి గుండె! నీ పాత గుండెలో - నిజమైన మానవరక్తం ఎండిపోయినా ఇంకా కొంచెం మిగిలే ఉంటుంది! కొద్దిరోజుల్లో అదికూడా పూర్తిగా ఎండిపోయి పాత గుండె పూర్తిగా నశించిపోతుంది. అప్పుడు - నువు ఇవాళ పడుతున్న బాధ - మనసులోని బాధ - లేకుండా పోతుంది. అది రెండో గుండెని తాకలేదు! నీకప్పుడు ఇలాంటి బాధ ఏమీ ఉండదు!' అని చెప్పాను. అతడు తలదించుకుని రెండుకళ్ళతో రెండు గుండెలూ చూసుకుంటూ వెళ్ళిపోయాడు. జబ్బుతో మంచం పట్టినప్పుడూ - చావు ముందూ - మనిషి నిజమైన జీవితం అంటే ఏమిటో ఆలోచిస్తాడా!?

★ ★ ★

దోపిడీ విషవాయువు వంటిది. అది అంతటా సహజవాయువులా వ్యాపించగలదు.

★ ★ ★

(1. ఆంధ్రప్రభ - దినపత్రిక - 27.11.1997)

(2. హిందీలోకి అనువాదం - మైసూర్ హిందీ ప్రచార పరిషద్ పత్రికా - ఆగష్టు 2003 - ప్రొఫెసర్. ఎస్.శేషారత్నం)